
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 15 సెప్టెంబరు 2024





జగనన్న కాలనీలో వేసిన బోరు

రూ.10 కోట్ల భూమి హాంఫట్!



తామాడ కొండను చదును చేసిన దృశ్యం

- తామాడ కొండపై తిష్ట వేసిన అక్రమార్కులు
- 40 ఎకరాల ప్రభుత్వ, అటవీశాఖ భూమి ఆక్రమణ
- చదును చేసి.. జీడి మొక్కల పెంపకం
- జగన్న లేఅవుట్ పేరిట వైసీపీ నేతల దందా

(రణస్థలం)

గత ఐదేళ్లలో వైసీపీ నేతల భూ దాహానికి అంతే లేకుండా పోయింది. కొండలు, వాగులు, చెరువులను సైతం ఆక్రమించేశారు. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు.. కబ్జా చేసేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి దందాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా లావేరు మండలం తామాడ రెవెన్యూ పరిధిలో ఒక కొండను ఆక్రమించిన విషయం బయటపడింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 40 ఎకరాలు ఆక్రమించేశారు. దీని విలు దాదాపు రూ.10 కోట్లు ఉంటుందని అంచనా.

ఆక్రమణ ఇలా.. :

తామాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 29లో 745 ఎకరాల కొండ ఉంది. ఆ భూమి అటవీశాఖ పరిధిలో కొంత భాగం ఉంది. అక్కడ అటవీశాఖకు సంబంధించి జీడి మొక్కలను సాగు చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కొండ దిగువ భాగంలో 1.49 ఎకరాల భూమిని జగనన్న లేఅవుట్‌కు కేటాయించారు. ఇళ్ల నిర్మాణానికి ఒక బోరును మంజూరు చేశారు. దాదాపు 49మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. నివాసయోగ్యంకాని ప్రాంతం కావడంతో లబ్ధిదారులు అక్కడ ఇళ్లు కట్టేందుకు ఆసక్తి చూపలేదు. కాని ఆ లేఅవుట్‌లో ఇప్పటికే రహదారులు నిర్మించారు. తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎకరా భూమి రూ.20లక్షల నుంచి రూ.30లక్షలు పలుకుతోంది. దీంతో ఐదుగురు వైసీపీ నేతలు అక్కడ భూములపై కన్నేశారు. 40 ఎకరాల మేర అటవీశాఖ, ప్రభుత్వ భూమిలో ఉన్న జీడిచెట్లను తొలగించారు. అంతా చదును చేసి.. తమ భూమిగా చెప్పుకొస్తున్నారు. ఆ భూమిలో మళ్లీ జీడి మొక్కలు వేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. తమకు పట్టాలు ఉన్నాయని, ప్రభుత్వం మంజూరు చేసిందని సదరు వైసీపీ నేతలు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖ, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దాదాపు రూ.10కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కైంకర్యం అవుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు.

విచారణ చేపడతాం

తామాడ కొండపై భూముల ఆక్రమణపై సమగ్ర విచారణ చేస్తాం. ఇప్పటికే దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జగనన్న లేఅవుట్ ఆక్రమణపై కూడా ఫిర్యాదు వచ్చింది. అవసరమైతే క్రిమినల్ కేసులకు ఆదేశిస్తాం.

- ఎం.జోగారావు, తహసీల్దార్, లావేరు

ఆ నేత కబంధ హస్తాల్లో..

అక్కడ కొండ భూమే కాదు.. జగనన్న కాలనీ నిర్మాణంలో భాగంగా 49మంది లబ్ధిదారులకు కేటాయించిన 1.49 ఎకరాల భూమి కూడా వైసీపీ నేత కబంధ హస్తాల్లో ఉన్నట్టు సమాచారం. అసలు అక్కడ లేఅవుట్ కేటాయించారని.. తాము లబ్ధిదారులమన్న విషయం చాలామందికి తెలయదు. ఏకంగా అక్కడ వేసిన రహదారులు, బోరును సైతం సదరు వైసీపీ నేత స్వాధీనంలో ఉన్నట్లు తెలుస్తోంది. అప్పట్లో జగనన్న కాలనీ లబ్ధిదారుల్లో బినామీలను పెట్టి తతంగం నడిపించినట్లు సమాచారం.

- ఎచ్చెర్ల నియోజకవర్గంలో అతి పెద్ద కొండల్లో తామాడ కొండ ఒకటి. ఈ కొండ పైనుంచి జాలువారే నీటిని ఈ ప్రాంతీయులు సాగునీరుగా వినియోగిస్తారు. మరోవైపు ఈ ప్రాంతంలో పశువులు, గొర్రెలు, మేకలు పెంపకం అధికం. ఈ జీవరాశులన్నీ ఈ కొండపైకే మేతకు వెళ్తుంటాయి. కొండపై జీడిచెట్లు అధికంగా ఉన్నాయి. అటవీశాఖ పరిధిలో ఈ భూములు కొంత మేరకు ఉన్నాయి. అయినా సరే వైసీపీ నేతలు భూ దందాకు తెరతీశారు. దీనికి అప్పట్లో అటవీ, రెవెన్యూశాఖలో కొంతమంది అధికారులు, సిబ్బంది సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి అక్రమాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చేనేత సందడి

- త్వరలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు
- వైసీపీ పాలనలో సంఘాలు నిర్వీర్యం
- బలోపేతంపై కూటమి ప్రభుత్వం కసరత్తు

(పొందూరు)

చేనేత కార్మికుల సంక్షేమ, అభివృద్ధి కోసం పాటుపడే.. చేనేత సహకార సంఘాల బలోపేతంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి.. కార్యవర్గాలను నియమించేందుకు సన్నద్ధమవుతోంది. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ సంఘాలను నిర్వీర్యం చేసింది. 2019 ఎన్నికల ప్రచారంలో వైసీపీ అధినేత జగన్.. తాము అధికారంలోకి వస్తే చేనేత సహకార సంఘాలను బలోపేతం చేస్తామని ప్రకటించారు. మరిన్ని పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 'నేతన్న హస్తం' పథకం మాత్రమే అమలు చేశారు. గత ఐదేళ్లు ఎన్నికలు నిర్వహించలేదు. వైసీపీ నేతలు, కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చేందుకు నామినేటెడ్ పోస్టుల ద్వారా త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ క్రమంలో చేనేత సహకార సంఘాలను నిర్వీర్యం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య బద్ధంగా కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వచ్చే నెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ సందడి ప్రారంభం కానుంది. డిసెంబరు 6న ఎన్నికలు నిర్వహించి.. నూతన కార్యవర్గం కొలువుదీరే అవకాశం ఉంది.

- జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో ప్రస్తుతం 33 చేనేత సహకారసంఘాలు ఉండగా.. వాటిలో 25 సంఘాలకే ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మిగిలిన సంఘాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయని నాయకులు చేనేతలు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు ఏటా అరకొర రుణాలు మంజూరు తప్ప, వాటి బలోపేతానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో పలు సంఘాలు నిస్తేజంగా మారాయి. ప్రస్తుతం ఈ సంఘాల్లో సుమారు 300 మంది సభ్యులు ఉన్నారు. కాగా.. సంఘాల్లో నకిలీ సభ్యులను తొలగిస్తేనే అసలైన కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందని పలువురు పేర్కొంటున్నారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకే సామాజిక పింఛన్ మంజూరవుతుంది. ఈ నేపథ్యంలో నాయకుల అండతో చాలా మంది చేనేత ఇతరులు చేనేత సంఘాల్లో సభ్యులుగా నమోదు చేసుకుంటున్నారు. ఇటువంటి వారిని గుర్తించి తొలగిస్తేనే అర్హులకు లబ్ధి చేకూరుకుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఏదిఏమైనా పదేళ్ల తర్వాత ఎన్నికలు జరగనుండడంతో మళ్లీ తమకు మంచి రోజులు వస్తాయని చేనేత కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఎన్నికలతో ప్రయోజనాలు

గత ప్రభుత్వం చేనేత సంఘాలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. చేనేత కార్మికులకు, సంఘాలకు ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్ణయంతో.. సొసైటీలకు, కార్మికులకు ప్రయోజనం కలుగుతుంది.

- కాలెపు శ్రీనివాసరావు, మాజీ ఉపాధ్యక్షులు, సాయిబాబా చేనేత సొసైటీ, పొందూరు



బలోపేతం దిశగా..

ఎన్నికలు నిర్వహించి కార్యవర్గాన్ని నియమించడం శుభ పరిణామం. పథకాల పునరుద్ధరణ ద్వారా సంఘాలకు, సొసైటీలకు ప్రయోజనం కలుగుతుంది. యార్న్ సబ్సిడీ, మార్కెట్ ఇన్సెంటివ్‌లు పునరుద్ధరిస్తే కచితంగా సంఘాలు బలోపేతమవుతాయి.

- ఒట్టం శ్రీనివాసరావు, మేనేజర్, సాయిబాబా చేనేత సొసైటీ, పొందూరు

మౌఖిక ఆదేశాలు వచ్చాయి

ప్రస్తుతం మౌఖిక ఆదేశాలు మాత్రమే వచ్చాయి. కలెక్టర్‌తో చర్చించిన తరువాత జిల్లాలో ఎన్ని సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి?. ఎన్నికల నియమావళిపై నిర్ణయం తీసుకుంటాం.

- సాయిప్రసాద్, ఏడీ, జిల్లా చేనేత జౌళ్లశాఖ, శ్రీకాకుళం.



పొందూరులోని చేనేత సహకార సంఘం కార్యాలయం

కార్యవర్గం ఇలా..

చేనేత సంఘాలకు 9 మంది సభ్యులను ఎన్నుకుంటారు. నిబంధనల ప్రకారం వీరిలో కనీసం ఇద్దరు మహిళలు ఉండాలి. ఈ తొమ్మిది సభ్యుల్లోనే అధ్యక్షుడిని, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. అలాగే కూటమి ప్రభుత్వ నిర్ణయంతో నూతనంగా చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు అవకాశం కలిగింది. గతంలో 100 మంది సభ్యులు ఉంటేనే సంఘం ఏర్పాటు చేయాలనే నిబంధన ఉండేది. దీనిని సవరిస్తూ.. కనీసం 30 మంది సభ్యులు ఉన్నా సంఘం ఏర్పాటు చేయవచ్చని ప్రభుత్వం స్పష్టం చేయడంతో నేతన్నలకు మేలు కలుగనుంది.

పథకాల పునరుద్ధరణ

చేనేత సంఘాలకు ఎన్నికల ద్వారా కార్యవర్గాలను నియమించి.. కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనేది ప్రభుత్వ నిర్ణయం. దీనిలో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించనుంది. ఇంతకు ముందు టీడీపీ హయాంలో అమలైన మార్కెట్ ఇన్సెంటివ్, యార్న్ సబ్సిడీ, థ్రిఫ్ట్ ఫండ్, ముద్ర రుణాలు వంటి పథకాలను పునరద్ధరించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

సెబ్ రద్దుపై హర్షం

- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 14: రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను రద్దు చేయడంపై ఎక్సైజ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శనివారం శ్రీకాకుళంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సీఎం నారా చంద్రబాబునాయుడు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లి రవీంద్ర చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ తిరుపతినాయుడు, సీఐ ఎంవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వివిధ విభాగాల్లో ఉన్న ఎక్సైజ్ శాఖను ఏకీకృతం చేయడం హర్షనీయమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు అచ్చెన్న, లోకేశ్, ఎమ్మెల్యే గొండు శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలతోపాటు నేర నియంత్రణకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎల్.మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

జాతీయ లోక్ అదాలత్‌లో 1,719 కేసుల పరిష్కారం

గుజరాతీపేట, సెప్టెంబరు 14: జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 1,719 కేసులు రాజీ చేసి పరిష్కరించామని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. సివిల్ కేసులకు సంబంధించి 121, క్రిమినల్ కేసులు 1,477, ప్రీ లిటికేషన్ కేసులు 121 రాజీ అయ్యాయని వెల్లడించారు. కార్యక్రమంలో 3వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.మహేంద్ర ఫణికుమార్, న్యాయాధికారులు పి.భాస్కరరావు, కేవీఎల్ హిమబిందు, ఆర్.సన్యాసి నాయుడు, కె.శారదాంబ, మెహిదిన్ జామరూత్ బేగం కమలుదీన్, ఏజేఎఫ్‌సీఎం శ్రీభరణి, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



కేసులను పరిష్కరిస్తున్న న్యాయాధికారులు

అధికారులు.. ఏం చేస్తున్నారు?

- గిరిజన స్థితిగతులు బాగోలేవు
- రోడ్లులేని గ్రామాలు చూస్తున్నాను
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ఆగ్రహం



మాట్లాడుతున్న జాటోత్ హుస్సేన్ నాయక్

మెళియాపుట్టి, సెప్టెంబరు 14: 'గిరిజనుల స్థితిగతులు బాగోలేవు. రోడ్ల కోసం వస్తున్న నిధులు ఏమవుతున్నాయి?. అధికారులంతా ఏమి చేస్తున్నారు?' అని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ప్రశ్నించారు. శనివారం మెళియాపుట్టి మండలంలో కొండపై ఉన్న కేరాశింగి గ్రామాన్ని ఆయన సందర్శించారు. రోడ్లు లేని దుస్థితి ఇక్కడే చూస్తున్నానని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మూడు నెలలో రోడ్డు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. మళ్లీ వచ్చి పనులు పరిశీలిస్తానని స్పష్టం చేశారు. ఈ మేరకు సకాలంలో పనులు పూర్తిచేస్తామని ఈఈ సింహాచలం తెలిపారు.

- 'అధికారుల నిర్లక్ష్యం వల్లే గిరిజన ప్రాంతాల్లో వెనుకబాటు కనిపిస్తోంది. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నట్టు అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయి. పాఠశాలలు మార్పు చెందాలి. ప్రభుత్వం నుంచి నిధులు చాలక ఇళ్ల నిర్మాణాలు మధ్యలో నిలిచిపోతున్నాయి. ఈ సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని జాటోత్ హుస్సేన్ నాయక్ తెలిపారు.
- అనంతరం గిరిజనులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ మేరకు మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీపీ బైరిశింగి లక్ష్మీనారాయణ కోరారు. ఐటీడీఏ నిధులు పక్కదారి పట్టాయని గిరిజన సంఘాలు నాయకులు విన్నవించారు. కొండలపై గ్రామాలకు రహదారి, తాగునీరు సౌకర్యం కల్పించాలని కోరారు. పాఠశాలలు లేక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. వీటిపై కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాద్ అహ్మద్ ఖాన్, ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి, డైరెక్టర్ కళ్యాణిరెడ్డి, కమిటీ సభ్యులు మిశ్ర, ఆకాశ్ త్రిపాఠి, భూషన్‌బిశ్వాల్, దీలక్ కూమార్ పాయిల్, ఆర్డీవో సుదర్శన్ దొర, తహసీల్దార్ హనుమంతురావు, ఎంపీడీవో చంద్రకుమారి, సర్పంచ్ ఆదిలక్ష్మి, జడ్పీటీసీ ఎండయ్య, గిరిజన సంఘం నాయకులు వాబ యోగి, చల్లా శాంతారావు, సరవ కూమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంకా పొరుగు మద్యమే

- ఒడిశా నుంచి యథేచ్ఛగా దిగుమతి
- ఆపై నకిలీ చెలామణి
- మందుబాబులకు అనారోగ్యం

(ఇచ్ఛాపురం)

జిల్లాలో పొరుగు మద్యం, సారా ఏరులై పారుతోంది. ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట ఒడిశా మద్యం పట్టుబడుతూనే ఉంది. ప్రస్తుతం ప్రభుత్వ మద్యం దుకాణంలో నాసిరకం, కొత్త బ్రాండ్లే దొరుకుతున్నాయి. ఒడిశాలో మాత్రం అన్నిరకాల బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. అందుకే వాటిని తెచ్చి జిల్లాలో విక్రయిస్తున్నారు. అయితే వాటి పేరిట ఇప్పుడు నకిలీ మద్యం చలామణి చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా.. ఒడిశాకు ఆనుకుని ఉంది. జిల్లాలో సగానికిపైగా మండలాలు ఒడిశా సరిహద్దులో ఉన్నాయి. ఒడిశాలోని గంజాం, గజపతి జిల్లాలకు మన జిల్లా నుంచి మార్గాలు అధికం. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో ఒడిశా మద్యం ఎక్కువగా జిల్లాకు చేరుకుంది. ఇప్పటికీ దానికి బ్రేక్ పడడం లేదు. ఒడిశా నుంచి తెస్తున్న మద్యాన్ని కొందరు నకిలీగా మారుస్తున్నారు. ఈ మద్యం తాగితే అనారోగ్యం కొని తెచ్చుకున్నట్టే. నిషా ఎక్కువగా వచ్చేందుకు కొన్ని రసాయనాలను కలుపుతున్నారు. బ్యాటరీ గుండతో పాటు ఇతరత్రా వ్యర్థ పదార్థాలను సైతం కలిపి.. సీసాల్లో నకిలీ మద్యాన్ని నింపుతున్నారు. ఆపై అచ్చం ఒడిశా, తెలంగాణ ప్రభుత్వాల ఎక్సైజ్ ముద్రలను అతికించి విక్రయిస్తున్నారు. అలాగే పట్టణం, పల్లెల్లో సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్యాకెట్ రూ.50 నుంచి రూ.70కు లభిస్తుండడం.. కిక్ ఇస్తుండడంతో ఎక్కువమంది మందుబాబులు సారానే తాగుతున్నారు. వ్యాపారులు ఒడిశా నుంచి రోడ్డు, రైలు, చివరకు నాటుపడవల ద్వారా సైతం సారాను జిల్లాకు చేర్చుతున్నారు.



పోలీసులకు పట్టుబడిన ఒడిశా మద్యం (ఫైల్)

- మూతపడిన చెక్ పోస్టులు

జిల్లాలో అక్రమ మద్యం, సారా రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. మొన్నటివరకూ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఉన్నా పెద్దగా పనిచేయలేకపోతోంది. గత వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా ఎక్సైజ్ శాఖను విభజించింది. దీంతో పోలీసులే సాధారణ తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయగలుగుతున్నారు. అటు అంతర్ జిల్లా, రాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్ పోస్టులను సైతం ఎత్తివేశారు. అక్కడ తనిఖీలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ స్పెషల్ పోలీసులను రిక్రూట్ చేసింది. మాజీ సైనికులకు స్పెషల్ పోలసులుగా నియమించి సారా, మద్యం రవాణా నియంత్రణ బాధ్యతలు అప్పగించింది. కానీ కొద్దిరోజులకే విధుల నుంచి తొలగించింది. చెక్‌పోస్టులు కూడా మూతపడ్డాయి. దీంతో ఒడిశా నుంచి మద్యం, సారాను జిల్లాకు తెచ్చి విక్రయిస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సెబ్‌ను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో మద్యం, సారా అక్రమ రవాణా అడ్డుకట్టపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

నకిలీ మద్యం ప్రాణాంతకం

మద్యం ఆరోగ్యానికి హానికరం. నకిలీ మద్యం తాగితే ప్రాణాంతకం. ప్రధానంగా ఊపిరితిత్తులను హరిస్తాయి. నాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయి. మత్తు ఇవ్వాలనే ఉద్దేశంతో రకరకాల రసాయనాలు, ఉత్ప్రేరకాలను వాడుతారు. అవి చాలా ప్రమాదకరం.

- డాక్టర్ పాతిర్ల దేవేంద్రరెడ్డి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, ఇచ్ఛాపురం

అక్రమ మద్యం రవాణాపై నిఘా

ఒడిశా నుంచి మద్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేకంగా ఇంటెలిజెన్స్ టీమ్‌తో నిఘా కూడా పెట్టాం. ఇటీవల 101 కేసులు నమోదుతో పాటు 102 మందిని అరెస్ట్ చేశాం. 578 బీర్ బాటిల్స్, భారీగా మద్యం బాటిల్స్, 12 వెహికల్స్ సీజ్ చేశాం.

- మజ్జి విజయలక్ష్మి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, ఇచ్ఛాపురం

మహిళలకు హెల్త్ వర్కర్స్ ట్రెయినింగ్

మంగళగిరి(ఏపీ)లోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం 'మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రెయినింగ్ కోర్సు'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. మహిళలు మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ఎయిడెడ్/ప్రైవేటు ఎంపీహెచ్‌డబ్ల్యు సంస్థల్లో శిక్షణ ఇస్తారు. కోర్సు వ్యవధి రెండేళ్లు.

అర్హత: ఇంటర్మీడియెట్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏ గ్రూపు వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. సప్లిమెంటరీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.

వయసు: డిసెంబరు 31 నాటికి 17 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ఎంపిక: మొత్తం సీట్లలో 60 శాతం 'ఫ్రీ సీట్లు' ఉన్నాయి. మిగిలినవి మేనేజ్‌మెంట్ సీట్లు. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అభ్యర్థుల అకడమిక్ ప్రతిభ ఆధారంగా ఫ్రీ సీట్లు భర్తీ చేస్తారు. మేనేజ్‌మెంట్ సీట్లకు సంబంధించి అభ్యర్థులు ఎంచుకొన్న ప్రైవేటు శిక్షణ కేంద్రాల్లో దరఖాస్తు సమర్పించాలి. వీటిని సెలెక్షన్ కమిటీకి పంపుతారు. కమిటీ ఆమోదించిన అభ్యర్థులకు ప్రవేశం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.50
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21
- **వెబ్‌సైట్:** cfw.ap.nic.in

ఐఐటీ మద్రాస్‌లో డిప్లొమా



మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి 8 నెలలు. ఒక్కో ప్రోగ్రామ్‌లో రెండు ఫౌండేషనల్ కోర్సులు, అయిదు ప్రోగ్రామ్ సంబంధిత కోర్సులు, ఒక స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ప్రోగ్రామ్‌నకు 35 క్రెడిట్స్ నిర్దేశించారు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు, డిగ్రీ ప్రోగ్రామ్‌లో కనీసం రెండేళ్లు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్: ఇందులో కంప్యూటేషనల్ థింకింగ్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్ అనే ఫౌండేషనల్ కోర్సులు; డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రోగ్రామింగ్-డేటా స్ట్రక్చర్స్-అల్గారిథమ్స్ విత్ పైథాన్, మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్-1&2 అనే ప్రోగ్రామింగ్ కోర్సులు; సిస్టం కమాండ్స్ అనే స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ఉంటాయి. మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ 1&2లకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

డిప్లొమా ఇన్ డేటా సైన్స్: ఇందులో మేథమెటిక్స్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్ అనే ఫౌండేషనల్ కోర్సులు; మెషిన్ లెర్నింగ్ ఫౌండేషన్స్, బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్, బిజినెస్ అనలిటిక్స్ అనే డేటా సైన్స్ కోర్సులు; టూల్స్ ఇన్ డేటా సైన్స్ అనే స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ఉంటాయి. బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్‌లకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

క్వాలిఫయర్ ఎగ్జామ్: డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్, బేసిక్ మేథమెటిక్స్ పేపర్‌లు ఉంటాయి. ఇంగ్లీష్ పేపర్ 25 మార్కులకు ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, లిజెనింగ్ ఎబిలిటీ, గ్రామర్, రైటింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. ఆప్టిట్యూడ్ పేపర్‌లో రీజనింగ్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ పేపర్‌లో సెట్ థియరీ, నెంబర్ సిస్టమ్, కో-ఆర్డినేట్ జామెట్రీ, క్వాడ్రాటిక్ ఫంక్షన్స్, పాలినామియల్స్ ఫంక్షన్స్, లాగరిథమ్స్, గ్రాఫ్ థియరీ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 3 గంటలు.

- డిప్లొమా ఇన్ డేటా సైన్స్‌లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంగ్లీష్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటేషనల్ థింకింగ్ పేపర్‌లు ఉంటాయి. ఇంగ్లీష్, మేథమెటిక్స్ పేపర్‌లు పై ప్రోగ్రామ్‌కు నిర్వహించేవాటి మాదిరిగానే ఉంటాయి. పైథాన్ పేపర్‌లో ఇంట్రడక్షన్ టు పైథాన్, కండిషనల్ స్టేట్‌మెంట్స్, లూప్స్, లిస్ట్స్, ఫంక్షన్స్, కలెక్షన్స్, రికర్షన్, ఫైల్ హ్యాండిలింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. స్టాటిస్టిక్స్ పేపర్‌లో డేటా, స్కేల్స్ ఆఫ్ మెజర్‌మెంట్, డేటా ఫ్రీక్వెన్సీ, వేరియబుల్స్, పర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్ ప్రాబబిలిటీ, రాండం వేరియబుల్స్, వేరియన్స్ తదితర అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. కంప్యూటేషనల్ థింకింగ్ పేపర్‌లో మల్టిపుల్ ఇటరేషన్స్, ఫిల్టరింగ్, ఫ్లో ఛార్ట్, సైడ్ ఎఫెక్ట్‌లు, గ్రాఫ్, మాట్రిక్స్, ట్రీ, బ్యాక్ ట్రాకింగ్, క్లాసిఫికేషన్, ఆబ్జెక్ట్ ఓరియంటేషన్ ప్రోగ్రామింగ్, రిమోట్ ప్రొసీజర్ కాల్, పోలింగ్ తదితర సాంకేతిక అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 4 గంటలు.

- క్వాలిఫయర్ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 40 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 50 శాతం మార్కులు రావాలి. ఓబీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 35 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 45 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 30 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 40 శాతం మార్కులు రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.6,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.3,000; ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 22
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, అనంతపురం, భీమవరం, గుంటూరు, కడప, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **డిప్లొమా క్వాలిఫయర్ ఎగ్జామ్ తేదీ:** డిసెంబరు 22
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** 2025 జనవరి 8 నుంచి 9 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** 2025 జనవరి 10 నుంచి
- **వెబ్‌సైట్:** diploma.iitm.ac.in

దిక్సూచి
DIKSUCHI

అంబేద్కర్ యూనివర్సిటీలో పీజీ డిప్లొమా



శ్రీకాకుళం(ఏపీ)లోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ(డాబీఆర్ఏయూ)- పీజీ డిప్లొమా ఇన్ గాంధియాన్ సోషల్ వర్క్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కోర్సు వ్యవధి ఏడాది. ఇందులోనే ఆర్నెల్ల ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ప్రోగ్రామ్ చివరలో ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. కోర్సులో భాగంగా క్యాంపస్ తరగతులు, ఫీల్డ్ వర్క్ ఉంటాయి. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సామాజిక, న్యాయ సంబంధిత రంగాల్లో పనిచేస్తున్న వారికి ఈ కోర్సు ఉపకరంగా ఉంటుంది. దీనిని పూర్తిచేసినవారు ఎన్జీఓ సంస్థలు, మీడియా సంస్థలు, గ్రామీణాభివృద్ధి సంస్థలు, కౌన్సెలింగ్ సెంటర్లు, సామాజిక అధ్యయన కేంద్రాల్లో ఉపాధి పొందే వీలుంది.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 15
- **వెబ్‌సైట్:** www.drbrau.edu.in

నవ్య | చిత్రజ్యోతి

సమంతకు అరుదైన గౌరవం



నటి సమంతకు ఓ అరుదైన గౌరవం దక్కింది. ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా) ఉత్సవం అవార్డ్స్ కార్యక్రమం ఈ నెల 27న దుబాయ్‌లో జరగనుంది. కార్యక్రమంలో ఆమెను 'ఉమెన్ ఆఫ్ ద ఇయర్' అవార్డుతో సన్మానించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. "ఈ తరానికి చెందిన ఉత్తమ నటుల్లో సమంత ఒకరు. తన వైవిధ్యమైన పాత్రలతో అభిమానులను నిరంతరం ఆకట్టుకునే ఆమెకు ఈ అవార్డును అందజేయటం ఆనందంగా ఉంది" అని ఐఫా నిర్వాహకులు తెలిపారు. "ఐఫా ఉత్సవం నాకెల్లప్పుడూ ప్రత్యేకమే. దక్షిణాది సినిమాను ప్రపంచ ప్రేక్షకులకు తెలియజెప్పే ఈ వేదికపై పాల్గొనడానికి నేను ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను" అని సమంత పేర్కొన్నారు.

150 మంది ఫైటర్లు... 300 మంది జూనియర్స్



నందమూరి కల్యాణ్‌రామ్ నటిస్తున్న తాజా చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ ప్యాక్డ్ ఎంటర్‌టైనర్‌ను అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం యాక్షన్ డైరెక్టర్ పీటర్ హెయిన్ సారథ్యంలో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరిస్తున్నారు. 15 రోజుల పాటు కొనసాగే ఈ చిత్రీకరణంలో 150 మంది ఫైటర్లు, 300 మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొంటున్నారు. సినిమాకు ఈ యాక్షన్ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుందని నిర్మాతలు చెప్పారు. విజయశాంతి పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రాఘవ లారెన్స్ 25వ సినిమా



'రాక్షసుడు', 'ఖిలాడీ' చిత్రాల తర్వాత నిర్మాత కోనేరు సత్యనారాయణ మరో భారీ చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. యాక్షన్, అడ్వంచర్ అంశాలతో రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో రాఘవ లారెన్స్ హీరోగా నటించనున్నారు. ఇది ఆయనకు 25వ సినిమా కావడం గమనార్హం. ప్యాన్ ఇండియా రేంజ్‌లో తెర కెక్కనున్న ఈ సినిమాకు రమేశ్ వర్మ దర్శకుడు. ఆయనతో కోనేరు సత్యనారాయణ తీస్తున్న మూడో చిత్రం ఇది. నవంబర్‌లో షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. సినిమా గురించి పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

దేవర సినిమాను కలిసి చూద్దాం

అభిమానికి ఎన్టీఆర్ వీడియో కాల్





బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తన అభిమాని కౌశిక్‌ను జూనియర్ ఎన్టీఆర్ శనివారం పరామర్శించారు. కౌశిక్ బెంగళూరు కిద్వాయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఆ అభిమానితో దాదాపు 10 నిమిషాలు ఎన్టీఆర్ వీడియో కాల్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. "నువ్వు నవ్వుతుంటే చాలా బాగున్నావు. ధైర్యంగా ఉండు. ట్రీట్‌మెంట్ తీసుకుని కోలుకో. తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి. త్వరలోనే కలుద్దాం. 'దేవర' సినిమాను ఇద్దరం కలసి చూద్దాం. ట్రీట్‌మెంట్ ఖర్చులకు సాయపడతాను" అని ఎన్టీఆర్ భరోసా ఇచ్చారు. అలాగే కౌశిక్ తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఆ వీడియో కాల్‌లో కౌశిక్ మాట్లాడుతూ "అన్నా, మిమ్మల్ని అస్సలు అనుకోలేదు" అని అన్నారు. దానికి బదులుగా ఎన్టీఆర్ "భలే వాడివే, నీతో మాట్లాడకుంటే ఎలా" అని అన్నారు. ఇటీవలే కౌశిక్ తల్లి ఓ వీడియో ద్వారా కుమారుడి ఆరోగ్య పరిస్థితి, జూనియర్ ఎన్టీఆర్ పట్ల తన కుమారుడికి ఉన్న అభిమానాన్ని తెలిపారు. దీంతో స్పందించిన జూనియర్ ఎన్టీఆర్, తిరుపతికి చెందిన తమ అభిమానసంఘం కన్వీనర్ కృష్ణయాదవ్‌ను బెంగళూరుకు పంపించారు. తనతో మాట్లాడించాలని సూచించారు. దీంతో కృష్ణయాదవ్‌తో పాటు అభిమానసంఘం కన్వీనర్‌లు మాణిక్యం, బసవ కిద్వాయ్ ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శించారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)


విజయ్‌కి ఇదే ఆఖరి చిత్రమా?



అగ్రహీరో విజయ్ నటించే తదుపరి చిత్రాన్ని శనివారం సాయంత్రం అధికారికంగా వెల్లడించారు. 'విజయ్69' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కే ఈ చిత్రం వచ్చే ఏడాది అక్టోబరు నెలలో ప్రేక్షకుల ముందుకురానుంది. మరో అగ్రహీరో అజిత్ కుమార్‌కు 'నెర్కొండ పార్వై' 'వలిమై', 'తుణివు' వంటి వరుస హిట్ చిత్రాలను అందించిన హెచ్.వినోద్ ఈ సినిమాకు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత వెంకట్ కె.నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీత స్వరాలు సమకూర్చే ఈ సినిమాలో పూజా హెగ్డే, సిమ్రాన్, మమిత బైజులను ఎంపిక చేయగా, విలన్ పాత్రను బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పోషిస్తున్నారు. కెమెరా: సత్యన్ సూరియన్. ఈ చిత్రానికి సంబంధించి విడుదల చేసిన పోస్టరులో 'త్వరలోనే ప్రజాస్వామ్యానికి వెలుగు చూపే వ్యక్తి రాక.' అంటూ ఆంగ్లంలో రాయగా, ఒక చేతితో టార్చ్‌ను పట్టుకుని కనిపిస్తున్నారు. కాగా, ఈ చిత్రం తర్వాత విజయ్ సినిమాలకు స్వస్తి చెప్పి.. పూర్తిస్థాయిలో క్రియాశీలక రాజకీయాల్లో నిమగ్నం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలే ఆయన 'తమిళగ వెట్రి కళగం' అనే పేరుతో రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

యుద్ధం నేపథ్యంలో ప్రేమకథ





సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో రణబీర్ కపూర్, ఆలియా భట్, విక్కీ కౌశల్ నటిస్తున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. జనవరిలో సినిమాను మేకర్స్ ప్రకటించిన మేకర్స్.. వచ్చే ఏడాది క్రిస్మస్‌కు సినిమాను విడుదల చేస్తున్నట్లు మొదట తెలిపారు. అయితే, తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని మార్చారు. 2026లో మార్చి 20న రంజాన్ సందర్భంగా సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ ఎపిక్ లవ్ డ్రామా కథేంటేంటన్నది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తిని కలిగిస్తోంది. ఈ సినిమా కథను మేకర్స్ ప్రకటించకున్నా.. ఇది యుద్ధం నేపథ్యంలో జరిగే ప్రేమకథ అని టాక్ వినిపిస్తోంది. అదే రోజున షారుక్ ఖాన్ నటించిన క్రైమ్ డ్రామా 'కింగ్' సినిమా విడుదలవుతోంది. కాగా, సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలోనే 'సావరియా' చిత్రంతో రణబీర్ సినీ రంగ ప్రవేశం చేశారు.

విడుదలకు ముందే అరవై అవార్డులు

ఇన్ ప్రోగ్రెస్



హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఫియర్'. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని దర్శకురాలు హరిత గోగినేని రూపొందిస్తున్నారు. సుజాత రెడ్డితో కలసి ఏ.ఆర్ అభి నిర్మిస్తున్నారు. అరవింద్ కృష్ణ ఓ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న 'ఫియర్' చిత్రం విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అరవైకి పైగా అవార్డులు పొంది సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. 'ఫియర్' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు ప్రభు దేవా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. త్వరలో థియేటర్లలో విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

కమ్ బ్యాక్ ఫిల్మ్



'శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి', 'అన్నయ్య', 'ప్రేమ కోసం', 'శివరామరాజు' తదితరులు చిత్రాల్లో నటించిన హీరో వెంకట్ కమ్ బ్యాక్ ఫిల్మ్ 'హరుడు'. హెబ్బా పటేల్, సలోని, నటషా, అలీ ఇతర ముఖ్య పాత్రధారులు. రాజ్ తాళ్లూరి దర్శకత్వంలో డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, డాక్టర్ దిక్కల లక్ష్మణరావు నిర్మిస్తున్నారు. ఇది కంప్లీట్ మాస్ ఎంటర్‌టైనర్ అని దర్శకుడు చెప్పారు. నవంబర్‌లో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు.

కౌన్ బనేగా కరోడ్‌పతిలో.. పవన్‌పై ప్రశ్న



పవన్‌కల్యాణ్‌కు ఇండియా వైడ్ ఉన్న క్రేజ్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ విషయం మరోసారి రుజువైంది. 'కౌన్ బనేగా కరోడ్‌పతి' సీజన్ 16కు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న అమితాబ్ బచ్చన్.. కంటెస్టెంట్‌ను ఓ ఆసక్తికర ప్రశ్నను అడిగారు.. జూన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వ్యక్తి ఎవరు? అని. ఇందుకు కంటెస్టెంట్ ఆడియన్స్ పోల్ ఎంచుకున్నారు. ఆడియన్స్‌లో 50శాతం మంది పవన్ అని జవాబు చెప్పారు. దీంతో ఈ సమాధానాన్ని లాక్ చేశారు. అది సరైన సమాధానం కావడంతో కంటెస్టెంట్ రూ. లక్ష అరవై వేలు గెలుచుకుని మరో ప్రశ్నకు వెళ్లారు.

ఎంత గౌరవమో!



తెలుగుజాతి గర్వించదగ్గ నటుడు నందమూరి తారకరామారావు. చిత్ర పరిశ్రమలో తను ఎదుగుతూ మరెందరికో అవకాశాలు కల్పించి ఆదుకున్న మంచి వ్యక్తిగా ఎన్టీఆర్‌కు పేరుంది. అలా ఆయన ఆశీస్సులతో తన కెరీర్‌ను చక్కగా మలుచుకున్న పాత తరం హీరోల్లో కాంతారావు ఒకరు. తొలి సినిమా 'ప్రతిజ్ఞ' తర్వాత సరైన అవకాశాలు లేక ఇంటికి తిరిగి వెళ్లిపోదామనుకున్న ఆయన్ని పిలిచి తన సొంత చిత్రం 'జయసింహ'లో తనతో సమానమైన పాత్ర ఇచ్చి ప్రోత్సహించారు ఎన్టీఆర్. అలాగే 'లవకుశ' సినిమాలో లక్ష్మణుడి పాత్ర కూడా ఎన్టీఆర్ గట్టి రికమండేషన్‌తోనే కాంతారావుకు దక్కింది. అలా ఎన్నోసార్లు తనని ఆదుకొన్న ఎన్టీఆర్ అంటే కాంతారావుకు ఎంతో అభిమానం, గౌరవం. కాంతారావు సొంత సినిమా పూజా కార్యక్రమానికి ఎన్టీఆర్ హాజరైన అరుదైన దృశ్యం ఇది. ఇందులో హీరోయిన్ జయంతి కూడా ఉన్నారు.

స్థానికంగా ఉండి పనిచేస్తారా.. బదిలీపై వెళ్లిపోతారా?

● బిల్ కలెక్టర్లు, పంచాయతీ సిబ్బందిపై మంత్రి అచ్చెన్న అసహనం

టెక్కలి, సెప్టెంబరు 14: పంచాయతీలో అన్ని రకాల పన్నులు వసూలు చేయాల్సిన బాధ్యత మీపై ఉంది.. మీరు ఇతర ప్రాంతాల నుంచి విధులకు వస్తున్నట్లు తెలుస్తోంది.. ఈ విషయాన్ని డీఎల్పీవో స్థాయి అధికారే ధ్రువీకరించారు.. మీరు స్థానికంగా నివాసం ఉండి విధులు నిర్వహిస్తారా.. లేకుంటే బదిలీ చేయించుకుని వెళ్లిపోతారా అని మంత్రి అచ్చెన్నాయుడు బిల్ కలెక్టర్లు, పంచాయతీ సిబ్బందిని ప్రశ్నించారు. శనివారం టెక్కలిలో వివిధ విభాగాల అధికారులు, పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టెక్కలిని పరిశుభ్రంగా ఉంచాలని, మిగిలిన ప్రాంతాల వారు ఆదర్శంగా తీసుకునేలా ఉంచాల్సిన బాధ్యత మీదేనన్నారు. అయితే ఇక్కడి పరిస్థితి ఎక్కడా లేదని, ఏవీధి చూసినా ఆవేదన కలుగుతోందన్నారు. పారిశుధ్య పనులు మెరుగ్గా ఉండకుంటే ఉపేక్షించేది లేదని, కార్మికుల సంఖ్య పెంచాలని, చెత్త సేకరణకు ట్రాక్టర్లు, వాహనాలు, మినీ ఎక్స్‌కవేటర్‌లను సమకూర్చుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు తెలుసుకోగా.. తాము పారిశుధ్య విధుల్లో భాగం గా కొందరు ముఖ్య నేతల ఇళ్లకు పంపిస్తున్నారని, దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు కార్మికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, అదనంగా మరో ఎలక్ట్రీషియన్‌ను నియమించాలని పంచాయతీకార్యదర్శి జగన్నాథరావుకు ఆదేశించారు. తాగునీటి కొళాయిల ద్వారా బురదనీరు రాకుండా క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. ముఖ్య కూడళ్లలో సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవా లన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటరామన్, తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి, డీఎల్పీవో ఐవీ రమణ, ఎంపీడీవో లక్ష్మీభాయి, సర్పంచ్ గొండేల సుజాత, నేతలు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, హనుమంతు రామకృష్ణ, సుందరమ్మ, లవకుమార్, లాడి శ్రీనివాస్, ప్రీతీష్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ● జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మార్చురీ, బయోవేస్ట్ ఉంచేందుకు అవసరమైన గదుల నిర్మాణానికి స్థలాన్ని శనివారం మంత్రి అచ్చెన్నాయుడు పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన ఈ పను లు చేపట్టాలని ఏపీఎస్ఐడీసీ అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో లిఫ్ట్ ఎందుకు పనిచేయడం లేదని సూపరింటెండెంట్ బి.సూర్యారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెంచేలా చర్యలు చేపట్టాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ కల్యాణ్‌కు సూచించారు. పట్టణంలో పశువుల సంచారం లేకుండా గోశాల నిర్మాణం చేపట్టాలని, దీనికి అవసరమైన స్థలాన్ని సేకరించాలని వంశధార ఈఈ బి.శేఖరరావు, తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తిలకు సూచించారు. ● నర్సింగపల్లిలో టీడీపీ నేత జోగారావు సంతాప సభలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. జోగారావు మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. జోగారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపాలి

● జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 14: గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపేందుకు కేంద్రం అధిక ప్రాధాన్యం ఇస్తుందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలని, అర్హులైన గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు సరైన శిక్షణ ఇవ్వాలన్నారు. ఎస్టీల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని, నిర్మాణాలు పూర్తయిన వసతి గృహాలకు బిల్లులు చెల్లించాలి. గిరిజన ప్రాంతాల్లో రోడ్డు లేని గ్రామం రికార్డుల్లో ఉండకూడదన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో పారదర్శకత పాటించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. సమీక్షలో భారత ప్రభుత్వ కార్యదర్శి పి.కల్యాణ్‌రెడ్డి, ఎస్సీఎస్టీ డైరెక్టర్ ఆర్ఎస్ మిశ్రా, రీసెర్చ్ అధికారి ఆకాష్ త్రిపాఠి, సీనియర్ ఇన్వెస్టిగేటర్ అశోక్‌కుమార్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **అరసవల్లి:** అరసవల్లి సూర్యనారాయణ స్వామిని జాతీయ ఎస్టీ కమి షన్ సభ్యుడు జటోతు హుస్సేన్ నాయక్ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, స్వామివారి జ్ఞాపికను ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు అందజేశారు.

● **ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం రైలు నిలయం గేట్ సమస్యలను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ దృష్టికి బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మంగి లక్ష్మి తీసుకువెళ్లారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. రైల్వే ఫ్లైఓవర్ లేకపోవడం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందిపడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరారు.

● **జలుమూరు:** భూమి దున్ని సాగు చేసిన వారికే సర్వ హక్కులు ఉంటాయని, మాకివలస గిరిజనులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. మాకివలస గ్రామాన్ని శనివారం సందర్శించి గిరిజనుల స్థితిగతులను, సమస్యలను తెలుసుకున్నారు. 200 ఎకరాలుంటే ల్యాండ్ సీలింగ్ యాక్ట్ అతనికి వర్తించదా అని ప్రశ్నించారు. 50 ఏళ్లకు పైగా సాగు చేస్తున్న గిరిజనులకు లేని హక్కు ఆయనకు ఎలా వర్తిస్తుందని నిలదీశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి గిరిజనులకు న్యాయం చేసేలా ప్రభుత్వం, కలెక్టర్ దృష్టికి తీసు కువెళతామన్నారు. సమావేశంలో సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి, శ్రీకాకుళం ఆర్డీవో రంగయ్య, తహసీల్దార్ లక్ష్మీనారా యణ, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు వాబ యోగి, బీజేపీ నాయకులు బి.ఉమామహేశ్వరరావు, పైడి వేణుగోపాలం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్

'వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే ఆందోళన'

పలాస: రాష్ట్రంలో వైసీపీ హయాంలో ప్రారంభించిన 14 మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ఇదే జరిగితే తాము ఆందోళన చేపడతామని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం ఆయన వైసీపీ కార్యాలయంలో విలేకరు లతో మాట్లాడుతూ.. పులివెందుల మెడికల్ కళాశాలలో సీట్ల భర్తీకి కేంద్రం అనుమతిస్తే రాష్ట్ర ప్రభుత్వం వద్దని తిప్పి పంపించడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. పలాస కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని జిల్లాకు చెందిన మంత్రి బంధువు ఒకరు పరిశీలించారని, ఆయన రాకతో ప్రజలకు ఎటువంటి సంకేతాలిస్తున్నారని ప్రశ్నించారు.

హరిపురం విద్యార్థుల ప్రతిభ

హరిపురం: హరిపురం హైస్కూల్ విద్యార్థులు ఇటీవల నిర్వహించిన క్విజ్, గ్రూప్ టాలెంట్ టెస్ట్, డిబేట్‌లలో ప్రతిభ కనబరిచారని హెచ్ఎం జి.ఉమారాజ్ తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. చిన్న బహడపల్లి, లింబుగాం, బీఎస్‌పురంలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ, ఎకువూరులో తృతీయ స్థానం సంపాదించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి జాతర అక్టోబరు ఒకటి నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నందున ఏర్పాట్లను దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్, అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు సదు పాయాలు, ఉచిత ప్రసాదం పంపిణీ, క్యూలైన్లు తదితర అంశాలపై ఈవో వాకచర్ల రాధాకృష్ణను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. కొత్తమ్మతల్లి ఉత్సవాన్ని రాష్ట్ర ఉత్సవంగా ప్రభు త్వం ప్రకటించడంతో ఈ ఉత్సవాలకు సీఎఫ్‌గా తనను నియమించారని తెలిపారు.

నేడు ఆచార్య రోణంకి అప్పలస్వామి జయంతి

టెక్కలి: బహుభాషా కోవిదుడు, ఆచార్య రోణంకి అప్పలస్వామి 117వ జయంతిని ఆదివారం సాహిత్య సాంస్కృతిక సమాఖ్య, పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బొడ్డ అయ్యబాబు, రోణంకి రామచంద్రరావు తెలిపారు. ఉదయం జూనియర్ కళాశాలలో అప్పలస్వామి విగ్రహం వద్ద సమావేశం నిర్వహించి నివాళి అర్పించనున్నామన్నారు. సాహితీవేత్తలు, శిష్యులు, సంఘాల సభ్యులు పాల్గొనాలని కోరారు.

గృహకల్ప లబ్ధిదారుల సర్వే

హిరమండలం: సుభలయ ఆర్అండ్ఆర్ కాలనీ పంచాయతీలో శనివారం ఎన్టీఆర్ గృహకల్ప లబ్ధిదారుల సర్వే నిర్వహించారు. ఈ సర్వేని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా ఎన్టీఆర్ గృహకల్పం లబ్ధిదారుల బిల్లులు చెల్లించ కుండా కాలయాపన చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు

● అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

నరసన్నపేట: పట్టణంలో పాతజాతీయ రహదారికి అనుకొని వంశధార కాలువ పక్కన గొట్టిపల్లి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను శనివారం రెవెన్యూ అధికారు లు అడ్డుకున్నారు. సర్వే నెంబర్ 172లో జిరాయితీ స్థలాన్ని కొందరు కొనుగోలు చేసి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని, వంశధార కాలువ, పాత హైవే స్థలాన్ని ఆక్రమించి విక్రయాలు చేపట్టారు. మార్కెట్ కమిటీ వరకు ఉన్న పాత హైవేపై హనుమాన్ వెయింగ్ కాటా వద్ద సర్వీసు రోడ్డుకు అనుసంధానం చేయడంతో ఈ రోడ్డులో రాకపోకలు తగ్గాయి. దీంతో వంశధార కాలువ నుంచి మార్కెట్ కమిటీ వరకు ఆక్రమించి అమ్మకాలు చేపట్టిన విషయం ఆలస్యంగా బయట పడింది. ఈ వ్యవహారంలో స్థానిక వైసీపీ నాయకుడి హస్తం ఉన్నట్లు సమాచారం. సదరు స్థలంలో బోరుబావి కూడా తీశారు. మార్కెట్ కమిటీ పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కూడా వైసీపీ ప్రభుత్వంలో రికార్డులు తారుమారు చేసి విక్రయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. 2011లో ఈ ప్రాంతంలో నిర్మాణాలు జరగగా అప్పటి సర్వేయర్ అప్పలనాయుడు, వీఆర్వో జ్ఞానేశ్వరరావు అడ్డుకున్నారు. 13 ఏళ్ల కిందటి ప్రభుత్వ స్థలం జిరాయి తీగా ఎలా మారిందో అధికారులకే ఎరుక. ఈ వ్యవహారంపై తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా సమాచారం రావడంతో అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నామని, సంబంధిత స్థలాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



ఏఎంసీ పక్క ప్రభుత్వ స్థలంలో నిర్మాణాల దృశ్యం

లోక్‌అదాలత్‌లో 144 కేసుల పరిష్కారం

టెక్కలి: స్థానిక కోర్టు సముదాయాల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 144 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ న్యాయాధికారి సీహెచ్ హరిప్రియ తెలిపారు. రెండు బెంచ్‌లు ఏర్పాటుచేసిన అదాలత్‌లో సివిల్ కేసులు ఒకటి, క్రిమినల్ 37, గృహహింస చట్టం కేసు ఒకటితో పాటు ఇతర రాజీకి తగిన కేసులు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, న్యాయవాదులు రాజేశ్వరరావు, గౌరీపతి, శ్రీనివాసరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పాతపట్నంలో 150..

పాతపట్నం: స్థానిక కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 రాజీపడదగిన కేసులను పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ న్యాయాధికారి మానెం రోషిణి తెలిపారు. డ్రంక్‌అండ్‌డ్రైవ్ కేసుల్లో 136 మందికి రూ.30,2200 అపరాధరుసుం విధించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఈ సత్యనారాయణ, పాతపట్నం, సారవకోట పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కొత్తూరులో 118..

కొత్తూరు: కొత్తూరు కోర్టు ఆవరణలో ఆన్‌లైన్‌లోజాతీయ లోక్‌అదాలత్‌ను జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.మణి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 118 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కక్షిదారులు నుంచి అపరాధ రుసుం రూ.1.11 లక్షలు వసూలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అప్పారావు, ఏజీపీ రాజు, లోక్‌అదాలత్ సభ్యుడు వి.సుధాకరరావు, ప్రభుత్వ ప్లీడర్ రఘునాథరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో 95..

కోటబొమ్మాళి: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయలోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీమార్గం ద్వారా 95 కేసులు పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత తెలిపారు. క్రిమినల్ కేసులు 31, క్రిమినల్ కేసుల్లో జరిమానా విధించినవి 54, మనోవర్తి 2తో పాటు ఇతర కేసులను పరిష్కరించామన్నారు. లోక్‌అదాలత్‌కు బెంచ్ సభ్యులుగా న్యాయవాదులు కె.మన్మథరావు, యు.తిరుమలరావు వ్యవహరించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, ఏపీపీ డి.హరిప్రియ, న్యాయవాదులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

కోటబొమ్మాళి: వినాయక నిమజ్జన సమయాల్లో, విద్యుత్ అలంకరణల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్వగ్రామం నిమ్మాడలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మండపం వద్ద సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు చోట్ల వినోదం కోసం ఏర్పాటు చేస్తున్న డీజేల శబ్దాల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. యువ న్యాయవాది కె.అచ్చెన్నాయుడు, నాయకులు రామ్మోహన్‌రావు, రెడ్డి అప్పన్న, కింజరాపు సురేష్ పాల్గొన్నారు. ● **టెక్కలి:** ఎన్టీఆర్ కాలనీలో వినాయక ఉత్సవాల్లో భాగంగా శనివారం కుంకుమ పూజలు, 51 రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా సామూహిక పూజలు

జలుమూరు/కాశీబుగ్గ: చిన్నదూగాం, కాశీబుగ్గ అంబేద్కర్ నగర్‌లో వినాయకుని సన్నిధిలో శనివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

కోటబొమ్మాళి: కొత్తపేట శ్రీశివకేశవ పంచాయతన ఆలయం వద్ద శనివారం పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వీరిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స అందించారు. ఆలయం వద్ద ప్రతిరోజు కుక్కలు గుంపులుగా తిరుగుతూ భక్తులు, ప్రజలపై దాడులు చేస్తున్నాయని, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

కందిరీగల దాడిలో ఇద్దరికి..

కిష్టపురం పంచాయతీ బలరాంపురానికి చెందిన రమణతో పాటు మరో వ్యక్తిపై శనివారం కందిరీగలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దాడిని చూసిన స్థానికులు వారిని హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు చికిత్స అందించారు. రమణ మేకల ఆహారం కోసం తోటకి వెళ్లి చెట్టుకొమ్మకోస్తున్న సమయంలో ఆ కొమ్మకు ఉన్న కందిరీగలు అతనితో పాటు పక్కనే ఉన్న వ్యక్తిపై కూడా దాడి చేసి గాయపరిచాయని గ్రామస్థులు తెలిపారు.

ఉద్యమాలకు ఊపిరి పోసిన వ్యక్తి సీతారాం ఏచూరి

కోటబొమ్మాళి: ఉద్యమాలకు ఊపిరి పోసిన వ్యక్తి సీతారాం ఏచూరి అని, ఆయన మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యుడు నంబూరు షణ్ముఖరావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. హనుమంతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

కోటబొమ్మాళి: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా శనివారం కోటబొమ్మాళి జూనియర్ కళాశాల మైదానంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల శాఖల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. పురుషులకు క్రికెట్, షటిల్, బ్యాడ్మింటన్, చెస్, మహిళలకు చెస్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరామ్మూర్తి, ప్రతినిధులు వై.వాసుదేవరావు, గొండు నారాయణరావు, గణపతి రావు, పాపారావు, ఆనందరావు, కమలాభాయ్ తదితరులు పాల్గొన్నారు. ● **నరసన్నపేట:** కాకినాడలో డిసెంబరులో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్ అన్నా రు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో స్వర్ణోత్సవాల్లో భాగంగా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరామమూర్తి, నాయకులు సుధీర్, కె.ఆదినారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ● **కాశీబుగ్గ:** యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా శనివారం కాశీబుగ్గ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు విజేతలకు బహుమతులను అందించారు. ఈశ్వరరావు, జగదీష్, వెంకటరమణ పాల్గొన్నారు.

చెస్ ఇన్ స్కూల్ జాతీయ కమిటీ వైస్‌చైర్మన్‌గా భీమారావు

టెక్కలి: చెస్ ఇన్ స్కూల్ జాతీయ కమిటీ వైస్‌చైర్మన్‌గా సనపల భీమారావును నియమిస్తూ ఆల్‌ఇండియా చెస్ ఫెడరేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికి చెస్ చేరువ చేయాలన్న కృతనిశ్చయంతో ఈ కమిటీని ఏర్పాటు చేశారని భీమారావు తెలిపారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శిగా వ్యవహరించిన టెక్కలికి చెందిన భీమారావుకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంపై పలువురు హర్షం వ్యక్తంచేశారు.

వంతెన నిర్మాణానికి కృషి చేయండి

నందిగాం: గొల్లూరు జాతీయరహదారి నుంచి రాంపురం వెళ్లే మార్గంలో గొల్లూరు వంశధార కాలువపై వంతెన నిర్మాణం చేపట్టాలని టీడీపీ నాయకులు జీరునాసీరెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం మంత్రి అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందించారు.

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి

● రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలు ప్రారంభం

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు హైస్కూల్ ఆవరణలో శనివారం రాష్ట్రస్థాయి బాలబాలిరల టెన్నీకాయిట్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లా సంతోష్‌కుమార్, ఎస్వీ జోగారావు క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం తారకేశ్వర పండా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎంఈవోలు డి.దాశరథి, బీవీ రమణ మాట్లాడుతూ చదవుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఇక్కడ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు, సూరాడ మోహనరావు, అర్జవెల్లి ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీలు చిట్టిబాబు, బి.మోహన రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే బగ్గు

జలుమూరు: ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో గుండు వలసకి చెందిన గొండు త్రినాథరావుకు శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1.08 లక్షలు మంజూరు చేస్తూ ఇచ్చిన ఆర్డర్‌ను ఆయన అందించారు. త్రినాథరావు మోకాలు కీలు మార్పిడి కోసం అయిన ఖర్చు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించినట్లు తెలిపారు. ● **వెదుళ్లవలస(పోలాకి):** గత ఏడాది పల్లిపేట సమీపంలోని వంశధార కాలువలో నీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు గుర్రపుడెక్కలో కూరుకుపోయి మృతి చెందిన వెదుళ్ల వలసకి చెందిన ముప్పిడి శాంతారావు కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీ నాయుడు, రాంబాబు, చిట్టి తదితరులు పాల్గొన్నారు. ● శనివారం మబగాంలో డ్రోన్ ద్వారా వరిపంటలో యూరియా, డీఏపీ, క్రిమిసంహారిక మందులు పిచికారీ విధానాన్ని ఎమ్మెల్యే రమణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో జేడీఏ శ్రీధర్, ఏడీఏ రవీంద్రభారతి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి సమస్యలను విన్నవించారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గం పాతపట్నం అని, ఎక్కువగా గిరిజన గ్రామాలున్నప్పటికీ నేటికీ కనీస మౌలిక సౌకర్యాలు లేని దుస్థితి నెలకొందన్నారు. ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వలసల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో ఉపాధి అవకాశాల కల్పనకు సహకరించాలని కోరారు.

ఓపీ సేవలు నిలిపి నిరసన

హిరమండలం: జీవో నెంబరు 85కు వ్యతిరేకంగా హిరమండలం, చొర్లంగి పీహెచ్‌సీల్లో శనివారం అత్యవసర వైద్య సేవలు మినహా ఓపీ సేవలను నిలిపివేసి నిరసన తెలిపినట్లు వైద్యులు సాయిగీత, యశ్వంత్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 85 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం శుక్రవారం వైద్యులతో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ● **కొత్తూరు:** పీహెచ్‌సీలో అత్యవసర వైద్య సేవలు మినహా ఓపీ సేవలను నిలిపివేసినట్లు మెట్టూరు పీహెచ్‌సీ వైద్యుడు కర్నేన రాంబాబు తెలిపారు. నిరసనలో వైద్యులు తేజశ్రీ, పెద్దిన ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

పలాస/కాశీబుగ్గ: సెబ్‌ను రద్దు చేసి పాత ఎక్సైజ్ విధానానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో ఎక్సైజ్ అధికారులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు శనివారం కాశీబుగ్గ కార్యాలయంలో సీఎం చంద్ర బాబు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ ఎంఆర్‌వీ అప్పారావు మాట్లాడుతూ.. సెబ్‌ను రద్దు చేస్తూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. దీనికి కృషి చేసిన సీఎం, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.




పామాయిల్ తోటలో విద్యుదాఘాతం.. కూలీ మృతి


రాము మృతదేహం

పొందూరు: గారపేట సమీపంలో శనివారం జరిగిన ప్రమాదంలో దల్లిపేట గ్రామానికి చెందినన భోగ రాము (42) మృతి చెందారు. కొన్నేళ్లగా పామాయిల్ తోటలో కూలిగా పనిచేస్తున్న రాము.. చెట్ల కొమ్మలు కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఇతడికి భార్య రాధ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ వి.సత్యనారాయణ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కాగా యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే రాము చనిపోయడని స్థానికులు, కుటుంబ సభ్యులు గ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అన్నదానంలో అపశ్రుతి

● గుండెపోటుతో వ్యక్తి మృతి


తిరుపతిరావు(ఫైల్)

పలాస: అన్నదానం చేస్తుండగా ఓ వ్యక్తి గుండెపోటుకు గురై మృతి చెందిన ఘటన బ్రాహ్మణతర్లాలో శనివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బ్రాహ్మణతర్లా బజారు వీధిలో గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మహా అన్నవితరణ చేపట్టారు. కమిటీ సభ్యుడు పట్నాల తిరుపతిరావు (59) భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తుండగా అకస్మాత్తుగా ఛాతీలో నొప్పి రాగా పక్కనే ఉన్న మరో సభ్యుడికి విషయం తెలిపాడు. ఆయనను పరీక్షిస్తున్నలోపే కూలబడిపోవడంతో స్థానికులు సపర్యలు చేశారు. ఆసుపత్రికి తరలించేందుకు సిద్ధమవుతుండగానే తిరుపతిరావు మృతి చెందినట్టు గుర్తించారు. నవరాత్రుల సందర్భంగా అందరితో కలివిడిగా తిరిగిన తిరుపతిరావు అకస్మాత్తుగా మృతిచెందడంతో కమిటీ సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. తిరుపతిరావుకి భార్య అన్నపూర్ణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ఎచ్చెర్ల: కేశవరావుపేట జంక్షన్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ మహిళ గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవరావుపేట గ్రామానికి చెందిన కూన లక్ష్మి శ్రీకాకుళం నుంచి ఆటోపై వస్తూ ఈ జంక్షన్‌లో దిగింది. ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా విశాఖ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొనడంతో ఆమె గాయపడింది. ఈమె ప్రస్తుతం శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతుంది. కాగా ఈ ఘటనపై ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

దొంగ దొరికాడు


చోరీకి పాల్పడిన వ్యక్తిని చెట్టుకు కట్టిన దృశ్యం

హిరమండలం: కిట్టాలపాడు గ్రామంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగతనం చేస్తుండగా.. ఓ వ్యక్తిని గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇద్దరు వ్యక్తులు ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీకి చొరబడ్డారు. గ్రామంలో వినాయక ఉత్సవాల వద్ద భజన కార్యక్రమాలు పూర్తిచేసుకుని గుడివైపు వస్తున్న కొందరు వీరిని గమనించారు. దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు బైక్‌పై పారిపోయేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో బైక్ స్టార్ట్ కాకపోవడంతో ఇద్దరిలో ఒక వ్యక్తి పారిపోయాడు. మరో వ్యక్తిని పట్టుకొని చెట్టుకు కట్టి ఉంచారు. ఆ వ్యక్తి దగ్గర ఉన్న అమ్మవారి హుండీ డబ్బులు తీసుకున్నారు. అనంతరం ఎస్ఐ మహ్మద్ యాసిన్‌కు సమాచారం ఇచ్చారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం.. ఐదుగురిపై కేసు నమోదు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

ఆమదాలవలస: పట్టణంలోని బీఆర్ నగర్ సమీపంలో ఐదుగురు యువకులు నుంచి రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ వివేకానంద తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వారిని విలేకరులకు చూపిస్తూ.. ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పట్టణంలో కొంతమంది యువకులు గంజాయి తాగడమే కాకుండా ఇతరులకు విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందిందన్నారు. దీంతో సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ కె.వెంకటేష్ కలిసి శుక్రవారం సాయంత్రం బీఆర్ నగర్ సమీపంలో దాడులు నిర్వహించగా.. ఐదుగురు యువకులు పట్టుబడినట్టు తెలిపారు. వారి నుంచి చిన్న చిన్న పొట్లాలుగా కట్టిన రెండున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. విచారణలో ఆ యువకులు ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి తెప్పించుకుని కొంతమందికి విక్రయిస్తున్న గుర్తించారన్నారు. ఒడిశా రాష్ట్రంలో వీరికి అమ్ముతున్న వ్యక్తితో పాటు స్థానికంగా కొనుగోలు చేస్తున్న వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకుంటామన్నారు.

ఆంధ్రా సరిహద్దులో 11.070 కిలోలు..

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి ఇచ్ఛా పురం పురుషోత్తపు రం చెక్‌పోస్టు మీదు గా గంజాయి రవా ణాను పోలీసులు అ డ్డుకున్నారు. శనివా రం పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ మీసా ల చిన్నమనాయుడు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం షిమోగ జిల్లా కడెకల్ గ్రామానికి చెందిన ఎస్.రాజేష్ గౌడ్, హరేజ్ గ్రామా నికి చెందిన జి.మధు(అలియాస్ మను)ఇద్దరూ ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి ఇచ్ఛాపురం వరకు ఓ ప్రైవేట్ బస్సులో చేరుకున్నారు. కర్ణాటక వెళ్లేందుకు బస్టాండ్ నుంచి బంగ్లా రోడ్ మీదుగా రైల్వే స్టేషన్‌కు కాలినడకన వెళ్తున్నారు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో తనిఖీలు చేపట్టారు. బ్యాగ్‌లో 11.070 కిలోల గంజాయి మూటలను గుర్తించి సీజ్ చేశారు. వారిద్దర్ని అరెస్టు చేసి, వారి నుంచి రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ చిన్నమనాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

కబేళాలకు తరలిస్తున్న పశువుల పట్టివేత

కంచిలి: స్థానిక జాతీయ రహదారిపై కబేళాలకు తరలిస్తున్న 12 పశువులను శనివారం పట్టుకున్నట్టు ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసినట్టు తెలిపారు. అలాగే జెన్నాఘయి సమీపంలో కబేళాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన మరో 32 పశువులను శుక్రవారం రాత్రి పట్టుకున్నట్టు ఎస్ఐ చెప్పారు. పశువులన్నింటినీ కొత్తవలస గోశాలకు తరలించనున్నట్టు తెలిపారు.

కేశవరావుపేట వద్ద 23..

ఎచ్చెర్ల: కేశవరావుపేట జంక్షన్ వద్ద అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న 23 పశువులను పట్టుకున్నట్టు ఎచ్చెర్ల పోలీసులు తెలిపారు. నరసన్నపేట నుంచి కొత్తవలస తరలిస్తున్నట్టు విచారణ తేలిందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి శనివారం వైభవంగా కల్యాణం నిర్వహించారు. బాద్రపద శుద్ధ ఏకాదశి (పరివర్తనా ఏకాదశి)ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించామని ఈవో రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, ఇప్పిలి షన్ముఖశర్మ, శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

గార ఎస్ఐగా జనార్దనరావు



గార: గార ఎస్ఐగా ఆర్.జనార్దనరావు శనివారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనకాపల్లి జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. కాగా బదిలీపై వెళ్తున్న ఎస్ఐ కృష్ణ ప్రసాద్‌ని స్టేషన్ సిబ్బంది సత్కరించారు.


ఆమదాలవలస: చంద్రబాబు చిత్ర పటానికి పాలభిషేకం చేస్తున్న దృశ్యం


పొందూరు: చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న సిబ్బంది, నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

ఆమదాలవలస: సెబ్‌ను రద్దు చేయడంపై ఎక్సైజ్ సీఐ కె.రాజారావు ఆధ్వర్యంలో సిబ్బంది ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటానికి పాలభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మెట్టక్కివలసలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద సీఐ రాజారావు మాట్లాడుతూ.. ఘన చరిత్ర ఉన్న ఎక్సైజ్‌శాఖను గత ప్రభుత్వం సెబ్‌గా ఏర్పాటు చేయడం ద్వారా పలు ఇబ్బందులు వచ్చాయన్నారు. నేటి కూటమి ప్రభుత్వం రద్దు చేయడం హర్షణీయమన్నారు. అనంతరం ఎస్ఈబీ స్టేషన్ బోర్డులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ బోర్డులు మార్పు చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

● **పొందూరు:** ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్‌శాఖా మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు శనివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో సిబ్బంది, టీడీపీ నాయకులు పాలభిషేకం చేశారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ)ని రద్దు చేస్తూ పాత విధానం ఎక్సైజ్ విధానం తీసుకురావడంపై సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు, కొల్లి రవీంద్ర చిత్ర పటాలకు పాలాభిషేకం, పుష్పాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, స్టేషన్ ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


రణస్థలం: చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

● **రణస్థలం:** స్పెషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను రద్దు చేసి ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించడంపై ఎక్సైజ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఎక్సైజ్ సిబ్బంది ముఖ్యమంతి చంద్రబాబు, ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్ర పటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ఎం.రవిప్రసాద్, పి.నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవకు సిద్ధంగా ఉండాలి

శ్రీకాకుళం కలెక్టరేట్: ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లాలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాడానికి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ, పాఠశాల విద్య, వైద్యారోగ్యశాఖ తదితర శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఈ కార్యక్రమం నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలను వారికి వివరించారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం, శ్రమదానం ద్వారా వ్యర్థాల తొలగింపు చేపట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, పర్యాటక ప్రదేశాలు వంటి చోట సామూహిక స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దీనికోసం నియోజకవర్గానికి ఒక డ్రోన్‌ను కేటాయిస్తున్నామని, వీటి ద్వారా పారిశుధ్య నిర్వహణ అత్యవసరమైన ప్రదేశాలను గుర్తించవచ్చన్నారు. అక్టోబరు 2, గాంధీ జయంతి రోజున ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి


ఏచూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కార్మికులు

అరసవల్లి: అణగారిన వర్గాల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అని, ఆయన మరణం కార్మిక, కర్షక, ఉద్యోగ, బహుజనులకు తీరని లోటని సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.గణేష్, ఎస్.బలరాం అన్నారు. ఏచూరి మృతికి ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుడివీధి మస్టర్ పాయింట్ వద్ద సంతాపసభ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.శంకర్, ఎ.గురుస్వామి, ఎ.రాము, డి.చిట్టిబాబు, డి.గణేష్, ఆర్.యుగంధర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని ఏపీ రైతు సంఘ కార్యాలయంలో ఏచూరి సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి వెలమల రమణ, నాయకులు బి.వాసుదేవరావు, కె.కొండయ్య, టి.అజయ్‌కుమార్, టి.నందోడు తదితరులు పాల్గొన్నారు ● రిమ్స్‌లో ఏచూరి మృతికి కార్మికులు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కన్వీనర్ ప్రకాశరావు, కె.సావిత్రి, టి.కుమారి, బి.సంతోషి, జి.కృష్ణవేణి, సీహెచ్ రాజేశ్వరి, ఎం.రమణ పాల్గొన్నారు.

శారదాపురంలో మానవ హక్కుల బృందం


గ్రామస్థులతో మాట్లాడుతున్న మానవ హక్కుల కమిటీ సభ్యులు

సోంపేట: శారదాపురం గ్రామంలో కల్తీసారా తాగి తమ కుటుంబ సభ్యులు చనిపోయారనే ఫిర్యాదుపై మానవ హక్కుల కమిటీ సభ్యులు శనివారం పరిశీలించారు. మానవ హక్కుల నిజనిర్ధారణ కమిటీ సభ్యులు కేవీ జగన్నాథరావు, బీన ఢిల్లీరావు, ఎస్.వెంకటరావు గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం మానవ హక్కుల వేదిక సభ్యులు విలేఖరులతో మాట్లాడుతూ.. కల్తీసారాకు బలై అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రభుత్వాలు స్పందించి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షుడు చౌదరి లక్ష్మణమూర్తి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాలకవర్గంతోనే సిక్కోలు అభివృద్ధి

శ్రీకాకుళం అర్బన్: కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించి పాలవర్గం ఏర్పాటుతో సిక్కోలు నగరం అభివృద్ధి సాధ్యపడుతుందని జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్ అభిప్రాయపడ్డారు. నగరంలోని విశాఖ సాయినగర్ కాలనీలో డ్రైనేజీలు, రోడ్డు సదుపాయం లేకపోవడంతో వరద నీళ్లు, వాడుక నీళ్లు రోడ్లపై నిల్వ ఉండిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు చంద్రమోహన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి సాయినగర్ కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులు ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాలనీ పెద్దలు ఉప్పాడ రాజేశ్వరి, గొర్లె అనురాధ, కలగ లక్ష్మి, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో చదువుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య తెలిపారు. విద్యాలయంలో శనివారం పేరెంట్స్ టీచర్స్ కమిటీ ఎన్నిక, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులో తల్లిదండ్రులు పాత్ర కీలకమైనదన్నారు. గతేడాది విద్యాలయంలో 10, 11 తరగతులు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని గుర్తుచేశారు. దీనికి సంబంధించి విద్యాలయానికి గృహ కల్ప అవార్డు వచ్చిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 104 కేసుల పరిష్కారం


లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయాధికారి, న్యాయవాదులు

పొందూరు: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం న్యాయాధికారి బి.జోత్స్న అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 104 కేసులు పరిష్కరించారు. కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ ఒక చక్కటి వేదికని న్యాయాధికారి బి.జోత్స్న అన్నారు. న్యాయవాదులు కె.రమణమూర్తి, బ్రహ్మజీ, రామ్మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజీయే సరైన మార్గం


మాట్లాడుతున్న న్యాయాధికారి

ఇచ్ఛాపురం: రాజీమార్గమే సరైనదని ఇచ్ఛాపురం మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఫరీష్‌కుమార్ అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఇందులో మొత్తం 35 కేసులు పరిష్కారమయ్యాయని న్యాయాధికారి తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నందికి రమణ్మరెడ్డి, న్యాయవాదులు ఉలాల భారతి దివ్య, రంగారావు, నాగారాజు పాత్రో, మనోజ్‌కుమార్, భగవాన్‌దాస్, ప్రేమలత తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

వైద్యురాలికి అభినందన


అభినందిస్తున్న జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు

ఇచ్ఛాపురం: ప్రముఖ వ్యాపారవేత్త, స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ కమిటీ ప్రధాన సభ్యులు వల్లంపాటు సుధీర్ కుమారై వి.శ్రీరమ్య వైద్య విద్య పూర్తి చేసుకొని విశాఖలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యురాలిగా విధుల్లో చేరడంపై పట్టణ ప్రజలు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, సూపర్ బజార్ మాజీ చైర్మన్ పి.ఈశ్వర్‌రెడ్డి, మురళి తదితరులు కలిసి ఆమెను అభినందించారు. కాగా అమ్మవారి ఆలయం అభివృద్ధిలో కీలకపాత్ర వహించిన ఆమె సుధీర్ కరోనా సమయంలో మృతి చెందారు.

అలరించిన ఘంటసాల గానావధానం


నాటికలోని ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: సుమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో డాక్టర్ సయ్యద్ రహమతుల్లా ఘంటసాల గానావదాన పాటలు, లఘునాటికలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా ఈ సందర్భంగా ఘంటసాల జీవితచరిత్రలో ముఖ్య ఘట్టాలలో లఘునాటికలు ఎంతగానో అలరించాయి. అనంతరం ఘంటసాల పాటలతో నిర్వహించిన అంత్యాక్షరి నిర్వహించారు. కార్యక్రమంలో సత్యవాణి, సావిత్రి, జి.సూర్యకుమారి, కె.శోభారాణి, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం


ఎమ్మెల్యేకు చెక్కు అందిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: బొంతల కోడూరు గ్రామానికి చెందిన వాకర్స్ రన్నర్స్ బ్యాచ్ విజయవాడ వరద బాధితుల కోసం విరాళంగా సేకరించిన మొత్తాన్ని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుకు శనివారం అందజేశారు. రూ.41 వేల చెక్కును ఎమ్మెల్యేకు అందజేసినవారిలో మాజీ సర్పంచ్ మాడుగుల వీరభద్రస్వామి, వాకర్స్ రన్నర్స్ బ్యాచ్ సభ్యులు అశోక్, రాజేష్, సూర్యనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబానికి ఆర్థిక సాయం

రణస్థలం: స్థానిక యూబీ పరిశ్రమలో పనిచేసిన కార్మికుడు కొంగరపు సింహాచలం ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులంతా ఒక్క రోజు వేతనం రూ.2.60 లక్షలు సాయాన్ని అందించారు. శనివారం కార్మికులు ఆ నగదను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

జాతి సమైక్యతకు హిందీ దోహదం

అరసవల్లి: భారత జాతి సమైక్యతకు, తద్వారా దేశ ప్రగతికి జాతీయ భాష హిందీ ఎంతగానో దోహదపడుతుందని నెహ్రూ యువకేంద్రం జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ అన్నారు. జాతీయ హిందీ దివస్ సందర్భంగా హిందీ ఫోరమ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో శనివారం నగరంలో నిర్వహించిన 'రాజ భాష హిందీ' ర్యాలీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పర్యాటకాధికారి నారాయణరావు, నటుకుల మోహన్, బాడాన దేవభూషణరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, హిందీ ఫోరం సమన్వయకర్తలు సంతోష్‌కుమార్, మండపల్లి రామకృష్ణారావు, నిరంజన్ ఐడంగా పాల్గొన్నారు.

● **గుజరాతీపేట:** పాఠశాలల్లో హిందీ భాషాభివృద్ధికి ఉపాధ్యాయులంతా కృషిచేయాలని ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ బి.విజయ భాస్కరరెడ్డి పిలుపునిచ్చారు. హిందీ ఫోరం శ్రీకాకుళం సారథ్యంలో స్థానిక అంబేడ్కర్ కళా వేదికలో సోమవారం నిర్వహించిన జాతీయ హిందీ దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో 60కోట్ల మంది హిందీ మాట్లాడగలరని, రానున్న రోజుల్లో రాజభాష ప్రపంచ భాషగా ఎదగాలని ఆకాంక్షించారు. డీఈవో ఎస్.తిరు మల చైతన్య మాట్లాడుతూ.. హిందీ దివస్ ఘనంగా నిర్వహించడంపై ఫోరాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులను, ఉపాధ్యాయులను సత్కరించారు. అంతకు ముందు ఏడు రోడ్ల కూడలి నుంచి హిందీ ఉపాధ్యాయలంతా శోభా యాత్రను అంబేడ్కర్ ఆడిటోరియం వరకు నిర్వ హించారు. ఫోరమ్ అధ్యక్షుడు ఐ.సంతోష్‌కుమార్ సభకు నివేదిక సమర్పించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


అరసవల్లి: శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం


గుజరాతీపేట: శోభయాత్రలో పాల్గొన్న హిందీ ఉపాధ్యాయులు

నేడు 'ఓరుగంటి'కి మహతి పురస్కార ప్రదానం

శ్రీకాకుళం కల్చరల్: ఉపనిషన్మందిరంలో నిర్వహిస్తున్న సాహిత్య గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రముఖ సాహితీవేత్త, ధారణావాచస్పతి ఓరుగంటి రాజ రాజేశ్వరీ ప్రసాద్‌కు మహతి విశిష్ట సాహితీ పురస్కారం అందిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ సంపత్‌కుమార్ తెలిపారు. ప్రతిఏటా ఈ పురస్కారాలను ప్రముఖ సాహితీ వేత్తలకు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం కోదండ రామాలయంలో సాయంత్రం 6 గంటలకు జరుగు కార్యక్రమంలో నగదు పురస్కారం అందించి అభినందించనున్నట్లు తెలిపారు. అలాగే శనివారం పొందూరు సుధాకర్ కరుణశ్రీ రచనలపై ప్రసంగించారు.

నేడు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

సోంపేట: పలాసపురం గ్రామంలో వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు 10వ తరగతి వరకు చదువుకున్న వారై ఉండాలని, టీమ్‌కు నలుగురు సభ్యులు మాత్రమే ఉండాలని, ఒక పాఠశాల నుంచి ఎన్ని టీమ్‌లైనా పాల్గొన వచ్చన్నారు. ఎటువంటి ప్రవేశ రుసుం లేదని, తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్, కరెంట్ అఫైర్స్, మైథాలజీ, జీకే మొదలగు సబ్జెక్ట్‌పై ఉంటుందని తెలిపారు. వివరాలకు 7287920142, 7799676357 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కేంద్రమంత్రికి పదవిపై హర్షం

గుజరాతీపేట: ఆసియా-ఫసిఫిక్ కాన్ఫరెన్స్ చైర్మన్‌గా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును ఎన్నుకోవడంపై నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సూర పాపారావు, సీపాన ముకుందరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బమ్మిడి నరేం ద్రకుమార్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

ఎచ్చెర్ల: స్థానిక శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో ఇంజనీర్స్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ సాంకేతిక అంశాలతో కూడిన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఎస్‌వీపీ రమణ మూర్తి నాయుడు, వివిధ బ్రాంచ్‌ల హెడ్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

17న డీవార్మింగ్ డే

అరసవల్లి: ఈ నెల 17న నిర్వహించనున్న డీవార్మింగ్ డే రోజున పిల్లలందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలు వేసి నులిపురుగులను నివారిద్దామని డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు వేయించనున్నట్టు తెలిపారు. కార్యక్రమం వైద్యారోగ్య సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో విజయవంతం చేయనున్నట్టు తెలిపారు.

ఎస్పీని కలిసిన పోలీసు అధికారులు

శ్రీకాకుళం అర్బన్: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పలు పోలీసు స్టేషన్లలో ఎస్ఐలుగా, సీఐలుగా నియమితులై బాధ్యతలు చేపట్టిన పోలీసు అధికారులు శనివారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని ట్రాఫిక్ సీఐ వి.నాగరాజు, వన్‌టౌన్ ఎస్ఐ ఎంవీ హరికృష్ణ, గార ఎస్ఐ రెళ్ల జనార్దనరావు, ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్, నౌపాడ ఎస్ఐ జి.నారాయణ స్వామి, నందిగాం ఎస్ఐ మొహమ్మద్ ఆలీ, కోటబొమ్మాళి ఎస్ఐ వి.సత్యనారాయణ కలుసుకున్నారు.

రెగ్యులర్ చేయాలి

అరసవల్లి: నర్సింగ్ అధికారుల హక్కులను కాపాడాలని, 115 జీవోను రద్దు చేయాలని నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ హనుమంతు సాయిరాం అన్నారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు చేస్తున్న 9వ రోజు ధర్నా శిబిరానికి శనివారం ఆయన వెళ్లి మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే కేసులు

ఇచ్ఛాపురం: పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. వీకేపేట ఎస్‌బీఐ బ్యాంక్ రోడ్డులో తరుచూ ట్రాఫిక్ సమస్య ఎదురవుతుండడంతో కొన్ని ఆంక్షలను అమలు చేశామన్నారు. రైల్వే గేటు నుంచి బ్యాంక్ మీదుగా మార్కెట్ జంక్షన్ వరకు భారీ వాహనాలు, లారీలు, వ్యాన్లు, ట్రాక్టర్లు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు భారీ వాహనాలకు అనుమతులు లేవన్నారు. నిబంధనలు పాటించనివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

విజయవంతం చేయండి

శ్రీకాకుళం క్రైం: ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించనున్న స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగరపాలక కమిషనర్ ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కమిషనర్ కార్యాలయంలో స్కూల్ ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష నిర్వహించారు.


స్టేట్‌బోర్డులో పరీక్షలపై హర్షం

గుజరాతీపేట: రాష్ట్ర ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు స్టేట్‌బోర్డులో నిర్వహించడంపై నోబుల్ టీచర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. మంత్రి నారా లోకేష్ విద్యార్థులపై అభిమానానికి నిదర్శనంగా తెలుస్తోందని, విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్‌ఎంల ప్రమోషన్ ప్రక్రియను చేపట్టి విద్యావ్యవస్థను పటిష్టపరచా లన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర పాపారావు, సీపాన ముకుందరావు డిమాండ్ చేశారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

ఆమదాలవలస: శాస్త్రీయ దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు అన్నారు. శనివారం అనంతపురం జిల్లాలో జరుగుతున్న మహాసభల్లో ఆయన పాల్గొని మహాసభను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లా జనవిజ్ఞాన వేదిక సభ్యులు గొంటి గిరిధర్, బొడ్డేపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపారాధన



బూర్జ: కురుంపేట గ్రామంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా శనివారం దీపారాధన చేశారు. మహిళలు, యువతులు పాల్గొని దీపాలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు